క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం



పూజలందుకుంటున్న మోక్ష నారాయణస్వామి

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం అధిక శ్రావణమాస శుక్ల ఏకాదశిని పురస్కరించుకొని వేద పండితుల ఆచారత్వమున ఉత్తర ద్వార దర్శనం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వార్లను మాడ వీధుల గుండా గరుడ సేవ చేశారు. అలాగే రథంపై స్వామి వార్లను ఊరేగింపు నిర్వహించారు. మహా మంగళహారతి కార్యక్రమంతో ఏకాదశి పూజలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా సుదర్శన హోమం



శ్రీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

వేంపల్లె : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీలక్ష్మి వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానమైన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం వేడుకగా జరిగింది. శనివారం ఆలయ అర్చకులు అచ్యుత్ నారాయణ ఆధ్వర్యంలో ఈ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హోమాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామానికి చెందిన తాడిగొట్ల ప్రసాద్‌రెడ్డి భార్య మల్లేశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి శనివారం పెద్దపుత్త గ్రామంలోని మృతురాలి ఇంటికి వచ్చి మృతురాలి కుటుంబ సభ్యులను, మృతురాలు తండ్రి చల్లా ఆదినారాయణరెడ్డిని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో కుమారునిపల్లె సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, కడప నగర మాజీ కార్పొరేటర్ పుత్తా వెంకటసుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు లోకేశ్వర్‌రెడ్డి, మునీంద్రారెడ్డి, బాలిరెడ్డి, సుబ్బిరెడ్డి, ఈశ్వరరెడ్డి, రవీంద్రారెడ్డి, వీరనారాయణరెడ్డి, బ్రంహానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు వహించండి

ఎర్రగుంట్ల : పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. ఇంటి నుంచు వచ్చే చెత్తను వీధుల్లో, కాలువల్లో పడేయకుండా తమ ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనంకు అందజేయాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఎర్రగుంట్ల : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరంను నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ రాఘురామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కిమ్స్, సవేరా హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. ఈ వైద్య శిబిరంను ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, మానవత వ్యవస్థాపకులు ఎస్. రామచంద్రారెడ్డిలు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

వైభవంగా పీర్ల గ్రామోత్సవం



ముద్దనూరులో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు



కొండపేటలో..



కె.అప్పాయపల్లెలో..

కమలాపురం : మండలంలో మొహర్రం పండుగను పురస్కరించుకుని పీర్ల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని కుళాయి స్వామి దర్గాతో పాటు కె. అప్పాయపల్లె, సి.గోపులాపురం, పెద్దచెప్పలి, చిన్న చెప్పలి తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన పీర్లను నిర్వాహకులు వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైన ఊరేగింపు పట్టణంలోని పురవీధుల గుండా సాగి శనివారం ఉదయం దర్గా వద్దకు చేరుకుంది. ఊరేగింపులో పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. పీర్లు మకాన్ల వద్దకు చేరుకోగానే భక్తులు అగ్ని గుండంలో నుంచి నడిచి వెళ్లారు.

వల్లూరులో..

వల్లూరు : మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని పెద్దపుత్త గ్రామంలో శనివారం పీర్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పీర్లకు చక్కెర, పప్పులు, బెల్లంలను ప్రసాదంగా సమర్పించి పంచిపెట్టారు. రాత్రి గుండం కాల్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పీర్ల వద్ద ఫాతెహా నిర్వహించి పానకాన్ని అందరికీ పంచి పెట్టారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని కొండపేటలో మొహర్రం వేడుకలను వైభవంగా నిర్వహించారు. శనివారం స్థానిక పీర్ల చావిడిలో పీర్లను ప్రతిష్ఠించారు. రెండు రోజుల పాటు పీర్లను ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పీర్లను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వెల్లటూరులో పీర్లను ఊరేగింపుగా తీసుకెలుతున్న ప్రజలు

లింగాలలో..

లింగాల : మండల కేంద్రంలో శనివారం మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పీర్లను ఎత్తుకొని అగ్నిగుండ ప్రవేశం చేశారు. జల్దీ నిర్వహించి గుండం పూడ్చి చెరువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ముస్లింలు పీర్లకు కట్టిన వస్త్రాలను తొలగించి పీర్లను మూటగా కట్టి పాటలు పాడుకుంటూ పీర్ల చావిడి వద్దకు తీసుకొచ్చారు. కార్యక్రమంలో హిందువులు, ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల, లోమడ, బలపనూరు తదితర గ్రామాల్లో వారం రోజులుగా పీర్లను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి అగ్ని గుండ కార్యక్రమం నిర్వహించారు. శనివారం పీర్లను ఎత్తుకుని అగ్ని గుండ ప్రవేశం చేశారు. అనంతరం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా పీర్ల జల సమాధితో మొహర్రం పండుగ వేడుకలు ముగిశాయి.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ఇస్లాం కోసం ప్రాణత్యాగం చేసిన మహమ్మద్ ప్రవక్త మనవళ్లు హజరత్ ఇమామే హుస్సేన్, హసన్‌లను స్మరించుకోవడం కోసమే మోహర్రం పండుగను నిర్వహించడం జరుగుతుందని జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీ, ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌసపీరాఖాద్రి కుమారుడు సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీలు తెలిపారు. శనివారం మోహర్రం సందర్భంగా స్థానిక మసీదులలో దువాయే ఆషురా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక దువా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : స్థానిక పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు శనివారం సాయంత్రం ఊరేగింపుగా తరలివెళ్ళాయి. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని చదివింపుల స్వీకరణతో కుల మతాలకతీతంగా వేడుకలను నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రశాంతంగా మొహర్రం వేడుకలు ముగిసాయి.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని పెండ్లిమర్రి, వెల్లటూరు గ్రామాల్లో శనివారం మొహర్రం వేడుకలను ప్రజలు కులమతాలకు అతీతంగా ఘనంగా జరుపుకున్నారు. పీర్ల చావిడి వద్ద హిందువులు, ముస్లింలు కలిసి పీర్లను ఏర్పాటు చేసి, పీర్లకు చదివింపులు చేశారు. అనంతరం పీర్లకు ఎదురుగా గుండం ఏర్పాటుచేసి గుండం ప్రవేశం చేశారు. సాయంత్రం బాణా సంచా, డప్పు వాయిద్యాల మధ్య పీర్ల ఊరేగింపు చేశారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు గ్రామంలో మొహర్రం పండుగ శనివారం ఘనంగా జరుపుకున్నారు. పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లను ఊరిగేంపుగా తరలించారు. ఈ వేడుకలలో కర్రసాము ఆట ప్రత్యేక ఆకర్షణీంగా నిలిచింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గరిశ మదన్‌మోహన్‌రెడ్డి పీర్ల చావిడిని నిర్మించి అభివృద్ధి చేస్తామన్నారని వేడుకల నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు కమాల్‌బాషా, దస్తగిరి, బాషా, జిన్నా తదితరులు తెలిపారు.



సింహాద్రిపురంలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు



లింగాలలో అగ్ని గుండం వద్ద పీర్లు



పెద్దపుత్త గ్రామంలో పీర్ల గ్రామోత్సవం



జమ్మలమడుగులో...

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బులు వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అడవుల్లో జీవ వైవిధ్యానికి పులులే కీలకం



వేంపల్లెలో పులుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు



పులివెందుల నగరవనంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

వేంపల్లె : అడవుల్లో జీవ వైవిధ్యానికి పులులే కీలకమని వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ డిప్యూటీ అధికారి డి.గురప్ప తెలిపారు. శనివారం అంతర్జాతీయ పెద్ద పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో వేంపల్లె అటవీశాఖ రేంజ్ అధికారి పి.బాలసుబ్రమణ్యం సూచనల మేరకు డిప్యూటీ రేంజ్ అధికారి డి.గురప్ప పెద్ద పులుల సంరక్షణ, వాటి ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పులులను సంరక్షించడం వల్ల అడవులను కాపాడుకోవచ్చునని.. ప్రతి ఒక్కరూ జంతువుల పరిరక్షణకు సహకరించాలన్నారు. పాంథేరా జాతికి చెందిన పెద్ద పులి (పాంథేరా టైగ్రిస్)ను మనదేశం జాతీయ జంతువుగా ఎంచుకుందన్నారు. పెద్ద పులులు ఉన్న ప్రాంతంలో అడవి అన్ని రకాలుగా జీవ వైవిధ్యంతో పచ్చగా ఉంటుందని.. పెద్ద పులులు తిరుగుతుండటంవల్ల అడవులలో వాతావరణ మార్పులను నివారించి సకాలంలో వర్షాలు కురిసేందుకు, మనకు కావాల్సిన ఆక్సిజన్ అందించేందుకు సహాయపడుతాయన్నారు. అందుకు పెద్ద పులుల సంరక్షణ కోసం అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపుతారన్నారు. పెద్ద పులులతోపాటు వన్య ప్రాణుల సంరక్షన కూడా అడవుల పరిరక్షణలో భాగమేనన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడి వన్య ప్రాణులను రక్షిద్దాం

పులివెందుల టౌన్ : పర్యావరణాన్ని కాపాడుకుని వన్య ప్రాణులను రక్షించే బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నగర వనం(రాణితోపు)లో ముద్దనూరు రేంజ్ అటవీ శాఖ అధికారి అశోక్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ ఎంతో అవసరమన్నారు. అవి అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గోపాలకృష్ణ, రజని, కుమార్‌లు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, వన్య ప్రాణుల రక్షణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ మహబూబ్‌బాషా, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశాంత్, డేనియల్‌బాబు, రాజా, వన సంరక్షణ సమితి చైర్మన్ కృష్ణ నాయక్, వైస్ చైర్మన్ కాంతమ్మ, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరసనలపై డీఈఓ ఇచ్చిన ఉత్తర్వుల ఉపసంహరణ



డీఈఓ రాఘవరెడ్డితో చర్చలు జరుపుతున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులు, విద్యార్థులు ధర్నాలు, ర్యాలీల్లో పాల్గొనకూడదని, అలా పాల్గొంటే సీసీఏ రూల్స్ కింద చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి జులై 15న జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులతో శనివారం మధ్యాహ్నం డీఈఓ రాఘవరెడ్డి చర్చలకు ఆహ్వానించారు. ఈ చర్చల్లో ఫ్యాప్టో నాయకులు పలు అంశాలను డీఈఓ దృష్టికి తెచ్చారు. దీంతో డీఈఓ ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లు తెలపడంతో వివాదం ముగిసింది. చర్చల్లో ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ్‌కుమార్ ఇటీవల బదిలీల్లో, పదోన్నతుల్లో జరిగిన కొన్ని అవకతవకలను డీఈఓ దృష్టికి తీసుకురాగా, వాటిని విచారించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని, ఎవరైనా నష్టపోయి ఉంటే వారికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. డీఈఓ ఉపాధ్యాయులను దుర్భాషలాడుతున్న విషయాన్ని ప్రస్తావించగా.. విద్యాశాఖను గాడిలో పెట్టాలనే అక్కడక్కడా కఠినంగా మాట్లాడానే తప్ప ఉపాధ్యాయులను కించపరచాలనే ఉద్దేశ్యం తమకు లేదన్నారని తెలిపారు. భవిషత్తులో స్నేహ పూరిత వాతావరణంలో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నట్లు చెప్పారు. చర్చలు జరిగి సమస్యల పరిష్కారానికి డీఈఓ హామీ ఇవ్వడంతో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆగస్టు 6న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విరమించుకున్నట్లు తెలిపారు. ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్ వెంకటసుబ్బయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం కమలాపురం వార్డు-1 సచివాలయం పరిధిలోని 15వ మున్సిపల్ వార్డు పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, విద్యుత్ స్తంభాలు కావాలని వినతులు అందడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఇంకా పథకాలు రానివారు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు. మీ సమస్యలు తెలుసుకోవడానికే, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం కోసమే జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని సీఎం జగనన్న ప్రారంభించారన్నారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా మారిందన్నారు. ఏపీలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని ఆయన స్పష్టం చేశారు. అవ్వా తాతలకు వారి మనవడు జగనన్న ఇస్తున్న పింఛన్ రూ.2750 దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. జనవరి నెల నుంచి అది రూ.3 వేలకు పెరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు వేల కొద్ది దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని ఒక్కటి నెరవేర్చలేదన్నారు. బాబు తన పాలనంతా అవినీతికి కేరాఫ్‌గా మారిందన్నారు. జన్మభూమి కమిటీలు లంచాలు, కమీషన్లు ఇచ్చిన వారికే అరకొర పథకాలు ఇచ్చారన్నారు. వ్యవసాయ రుణాలన్నీ మాఫీ చేస్తానని జగనన్న ఒక్క దొంగ హామీ ఇచ్చి ఉంటే 2014లోనే సీఎం అయ్యేవారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సీఎస్ నారాయణరెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఖాజాపీర్, గఫార్, హిదాయత్, ఇర్ఫాన్, ఖాజా హుసేన్, మోహన్‌రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, వంశీధర్ రెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, మస్తానయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, టీవీ సుబ్బరాయుడు, నిఖిల్‌రెడ్డి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో కొనసాగుతున్న నిరసనలు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రీజనల్ అధ్యక్షుడు మల్లేశుడు, తదితరులు పాల్గొన్నారు.

2న ఆలయ భూముల వేలం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న శ్రీ మాధవ-ఆంజనేయ, శ్రీ ఈశ్వర-వీరభద్ర దేవాలయాలకు సంబంధించిన భూముల వేలాన్ని వచ్చే నెల 2వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రాచార్యులు తెలిపారు. మొత్తం 59 ఎకరాలు రెండు సంవత్సరాలకు కౌలుకు దేవాలయ ప్రాంగణంలో వేలం వేయబడునని తెలిపారు. ఇప్పటికే పలు కారణాలతో మూడు సార్లు ఆలయ భూముల వేలం వాయిదా పడటంతో నాలుగవ సారైనా అధికారులు వేలం నిర్వహిస్తారో లేదో అని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

రేపు జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

జమ్మలమడుగు : విభజన చట్టంలో ఉన్న కడప ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం చెప్పడం ఆంధ్రులను అవమానించడమే అవుతుందని దీనికి నిరసనగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే భారీ ధర్నాను విజయవతం చేయాలని సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి శివనారాయణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కొండాపురం : మండలంలోని ఓబన్నపేట పునరావాస కేంద్రంలో ఐదు మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్దనుంచి రూ.17200 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎఎస్ఐ షేక్ అహ్మద్‌బాషా శనివారం తెలిపారు.

తిరుచ్చి వాహనంపై కడపరాయుడు



మాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి శనివారం తిరుచ్చి వాహనంపై గ్రామ ప్రజలకు దర్శనమిచ్చారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు మయూరం కృష్ణమోహన్, సాయి బృందం తొలుత మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి రథంపై కొలువుదీర్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని గోవింద నామస్మరణల మధ్య దేవునికడప మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు తమ ఇళ్ల వద్దకే తరలివచ్చిన దేవతామూర్తులను దర్శించుకుని పూజా సామగ్రిని అందజేసి మొక్కుకున్నారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం



సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో శనివారం సాయంత్రం మహిళా భక్తులు సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. దాదాపు వంద మందికి పైగాగల ఈ బృందానికి ఇటీవల తిరుమల-తిరుపతి దేవస్థానాల నృత్య నీరాజనం వేదికపై ఆగస్టు 1వ తేదీ సాయంత్రం ఈ పారాయణం ఆలపించేందుకు అనుమతి లభించింది. దీంతోపాటు ఇదే బృందానికి చెందిన కళాకారులు ఆలయ మాడవీధుల్లో కోలాటం చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. ఇందుకోసం స్థానిక కళాకారులు దాదాపు రెండు నెలలపాటు విష్ణుసహస్రనామ పారాయణంతోపాటు కోలాటాన్ని కూడా అనుభవం గల గురువుల పర్యవేక్షణలో శిక్షణ పొందారు. శనివారం ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి పర్యవేక్షణలో వీరు నామ పారాయణం నిర్వహించిన అనంతరం ఆలయంలో శ్రీరాముడికి విశేష పూజలు నిర్వహించారు. వీరు సోమవారం తిరుమలలో తమ ప్రదర్శన ఇచ్చేందుకు అన్నమయ్య కాలిబాట ద్వారా వెళ్లనున్నారు.

ఆకట్టుకుంటున్న హస్త కళారూపాలు



ప్రదర్శనను తిలకిస్తున్న కొనుగోలుదారులు

కడప కల్చరల్ : కడప నగరం టీటీడీ కళ్యాణ మండపంలో శ్రీ కళాజ్యోతి హస్తకళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రదర్శనకు విశేష ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా కళాకారులు రూపొందించిన పలు హస్తకళారూపాలు నగరవాసులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. మన ప్రాంతంలో అరుదుగా కనిపించే కొండపల్లి కొయ్యబొమ్మలు, ఏటికొప్పాక కళారూపాలతోపాటు జైపూర్ పెయింటింగ్‌లు, ఉడ్ కార్వింగ్ బొమ్మలు, చూపరులను ఆశ్చర్యచకితులను చేస్తున్నాయి. ఇవి మన ప్రాంతంలో లభించవు కాబట్టి ప్రజలు వీటి పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు.